
# చీర


బొమ్మకంటి సత్యనారాయణ

ఆ రోజు శనివారం. కళ్ళు నులుముకుంటూ పక్కనే టేబుల్ పై నున్న రేడియో ఆన్ చేసేసరికి వెంకటేశ్వర సుప్రభాతమ్ శ్రావ్యంగా వినపడుతూంది. 'అప్పుడే ఆరు దాటి పోయింది. తొందరగా స్నానం చెయ్యాలి. అందరికీ తల అంటాలి. ఇంకా పని మనిషి రాలేదు' అనుకుంటూ పెరట్లోకి వెళ్ళింది తాయారమ్మగారు.

అంతలోనే వీధి తలుపు బాదుతూంది పనిమనిషి సరోజిని. వీధి గదిలోనే పడుకున్న సుమతి—అమ్మ



వచ్చి తీస్తుందిలే అని చూస్తూంది! ఇంకా అమ్మగారూ అంటూ తలుపు చప్పుడెక్కువయ్యే సరికి తప్పదన్నట్లు లేచి పవిట సవరించుకుంటూ




"అంత గట్టిగా బాదకపోతేయేం?" అంటూ విసుగ్గా తలుపు తెరిచింది.

అంతే ఒక్కసారి షాక్ తిన్నట్లుంది. కలా! కళ్ళు నులుముకుని మళ్ళీ చూసింది. అదే. పనిమనిషి సరోజినే! సరిగ్గా రెండు నెలల క్రితం పండక్కి అమ్మ కొనుక్కున్న చీర అదే. ఆ చీర కట్టుకుని తలార బోసుకుని, తల్లో మల్లెపువ్వులు పెట్టుకుని ప్రత్యక్షమైన సరోజినిని చూసేసరికి సుమతికి ఏమనాలో అర్థంకాక నిశ్చేష్టురాలై నిలిచింది. "లేవండి అమ్మాయిగారూ తొందరగా పళ్ళు తోముకోండి. మీకు తలంటు పోసి వెళ్ళిపోతాను" అంటూ చకచకా పెరట్లో నూతి వైపుకు వెళ్ళిపోయింది.

సుమతి మళ్ళీ మంచ మెక్కి దుప్పటీ ముసుగు తన్నింది. నిద్ర రావడం లేదు. పని మనిషి సరోజినికి ఈ చీర ఎక్కడిది? కొనుక్కుందా? రెండు వందల రూపాయిలు తక్కువ ఉండదు. అంత డబ్బెక్కడిది? ఎప్పుడూ వాళ్ళూ, వీళ్ళూ ఇచ్చే పాత చీరలు తప్ప ఇంత ఖరీదైన చీర కట్టలేదు. అదీ సరిగ్గా అమ్మ కొనుక్కున్న లాంటిదే. పండక్కి నాన్నగారితో దెబ్బలాడి మరీ అంత ఖరీదు చీర కొనిపించేసింది అమ్మ. ఆ చీర అమ్మ కట్టుకుంటే ఎంత బాగుంది. తనూ ఒక మారు కట్టుకు చూసింది. కాని అలాటి చీరే సరోజినికి ఎలా వచ్చిందీ? అంట్లు తోముకునే దీనికి ఇంత విలువైన చీరెందుకు? తగుదునమ్మా అని ఉదయాన్నే కట్టుకు తయారయింది. అసలు తనే రోజు అదే అమ్మ చీర కట్టుకుని మేటనీకి వెళ్ళా లనుకుంది. ఇంకెలా? పని మనిషి, తను ఒకే రకం చీర కట్టుకోవడమా? అయినా వీళ్ళకి జ్ఞాన ముండదు. ఛీ. గంగిరెద్దులా ఉంది ఆ చీర కట్టుకుని. కష్టపడి సంపాదించిన డబ్బులు ఇలా తగలేస్తే తిండికేం మిగుల్తుంది. అందుకే ఇంటింటికి తిరుగుతారు. అందుకే వీళ్ళెప్పుడూ బాగుపడరు. బాగు పడాలని వీళ్ళ కుండదు. మొగుడేమో తాగి రోడ్లమీద దొర్లుతుంటే ఇదేమో సింగారించుకుని తిరుగుతుంది.

"లెండమ్మాయిగారూ! తొందరగా తలంటి పోస్తాను. ఇంకా చేనా పనుంది" అంటూంది సరోజిని. సరోజిని మాటలు వింటుంటే పుండు మీద కారం జల్లినట్లుంది సుమతికి. ఆమెను ఆ చీరలో చూస్తుంటే అసహ్యమేస్తూంది. ఒక్కసారి ముసుగు లాగి పడేసి లేచి కూర్చుని, "ఏమిటే! ఒకటే గోల. కాకిలా అరుస్తున్నావు. నడు" అంటూ పెరట్లోకి వెళ్ళింది. ఎప్పుడూ తనను విసుక్కోని అమ్మాయిగారు కసరు కొన్నట్లుగా మాట్లాడుతుంటే తనేం తప్పు చేసిందో తెలియదు సరోజినికి. అలా ఆలోచిస్తూనే కుంకుడు కాయలు, నీళ్ళు సిద్ధం చేసింది. ఈ లోగా సుమతి పళ్ళు తోముకుని తల విప్పుకుని బాత్ రూమ్‌కి వచ్చింది.

తన పట్ల నిర్లక్ష్యమైన చూపు చూస్తున్న సుమతి కళ్ళను పరిశీలించింది సరోజిని. బాగా ఆలోచించింది. ఎంత చదువు కోకపోయినా మనుషుల మనుగడలు, మనోభావాలు గ్రహించలేని పసిపాప కాదు తను. సుమారు నలభై సంవత్సరాల నుండి లోకాన్ని, మనుషుల్ని చూస్తూంది ఆమె. అందుకే సుమతి పరిస్థితిని, మనోభావాన్ని గ్రహించింది.

సుమతితో బాత్‌రూమ్‌కి వెళ్ళి ఆమెను కూర్చో మని—"మెల్లగా రుద్దుకోండమ్మా! పులుసు పోస్తాను. తుళ్ళీ పోగలదు" అంది సరోజిని. "ఏం తుళ్ళితే, ఓహో! చీర పోతుందనా! అలాటప్పుడు పనిచేసే నీ కిలాటి చీరెందుకు? ఎవరికీ తగిన బట్టలు వాళ్ళు కట్టుకోవాలి. కాకి ముక్కుకి దొండ పండులా నీ కీ చీరెందుకూ?" అని కస్సు బుస్సుమంది.

"కూర్చోండమ్మా! మెల్లగా పోస్తూ మీకో విషయం చెబుతాను. శ్రద్ధగా వినండి. అంతా విన్నాక మీరే జవాబిద్దురు గానీ" అంటూ చెప్పడం ప్రారంభించింది.

• • • •

సూరీడు కంటె ముందుగానే లేచిన సరోజిని సూరీడుతో బాటే రోజంతా తిరుగుతూ సూరీడ్ని సాగనంపి ఇంటికి చేరుతుంది. ఈ లోగా కొడుకు స్కూలుకి వెళ్ళి రావడం, కూతురు మిషన్ నేర్చుకోడానికి వెళ్ళి రావడం జరిగి పోతాయి. అయితే ఇక ఆ ఇంటి యజమాని—అదే చంద్రయ్య ఎప్పుడు ఎక్కడుంటాడో, ఏ సైమ్ముకు గూటికి చేరతాడో ఏ స్థితిలో చేరతాడో ఆ భగవంతుడికే తెలియాలి.

సరోజిని నాలు గిళ్ళలో పని ముగించుకుని మధ్యలో ఒక్కసారి ఇంటికెళ్ళి వాళ్ళిచ్చిన అన్నం వగైరా ఇంటి దగ్గర పెట్టి మళ్ళీ పోతుంది. "ఓర్పుకి మారుపేరు స్త్రీ" అన్న దెవరో కాని సరోజిని పట్ల మాత్రం అది యథార్థం. ఆమె అందరిలాగే పెళ్ళికి పూర్వం ఎన్నో కలలు కంది. భర్త అనురాగంలో ఓలలాడాలని ఆశించింది. అందుకు తగిన వరుడే దొరికాడు. అన్ని విధాలా అందరికీ నచ్చిన చంద్రరావు నిచ్చి వైభవంగా పెళ్ళిచేశారు.

స్త్రీ ఎంత ఉన్నత కుటుంబంలో పుట్టినా ఎన్ని సద్గుణాలున్నా ఆమెకు వివాహంతోనే సంపూర్ణత్వం లభిస్తుంది. వివాహమే ఆమె జీవితగమ్యాన్ని చూపెడుతుంది. అది ఆమె అదృష్టమనాలో, పూర్వ జన్మ ఫల మనాలో ఏదైతేనేం పెళ్ళయిన ప్రతి స్త్రీ సుఖపడుతుందో లేదో నిర్ణయించలేం. అందుకే సరోజిని జీవితం ఆశించిందానికి భిన్నంగా మారింది.

పెళ్ళయిన ఐదేళ్ళ వరకు మామగారి హయాంలో ఇల్లు నడిచేది. ఆయన చాలా హుందాగా పొలంమీద వచ్చిన ఆదాయాన్ని మితంగా ఖర్చు పెడుతూ ఉన్న ఇద్దరాడపిల్లలకి పెళ్ళిచేశాడు. ఆయన పోతూ ఉన్న ఒక్క కొడుక్కి మూడె కరాల భూమిని ఒప్పగించి మరీ కన్నుమూశాడు.

దాంతో ప్రారంభమయింది చంద్రరావుగారి పతనావస్థ. అప్పటికే చంద్రరావుకి ఇద్దరు సంతానం. కొడుక్కి మూడేళ్ళు. కూతురికి రెండేళ్ళు. వాళ్ళిద్దర్నీ ప్రయోజకుల్ని చెయ్యాలనే ఆలోచనే అతనికిలేదు. కోడిపందాలు, పేకాట, వాటితోపాటు తాగుడు. దీంతో అప్పుల పాలయ్యాడు. తల్లి రోజూ చెప్పి చెప్పి విసిగిపోయి చివరకు కూతురింటికి వెళ్ళిపోయింది.

ఇంక సరోజిని పిల్లల్తో మిగిలింది. ఆమె చాల గుట్టైన మనిషి. ఎన్ని బాధలున్నా చిరునవ్వుతో అందరి దగ్గరా మంచితనంగా మసలుకొనేది. భర్తను ఏ నాడు చీదరించుకోలేదు. బతిమాలుకొంది. బాధ్యతలు గుర్తుచేసింది. ఎన్నయినా చంద్రరావు బుర్రకెక్కలేదు. ఆస్తంతా తగలేశాడు.


చివరికి సరోజిని పరిస్థితి తిండి తినడానికికూడా కరువయ్యింది. వస్తే ఇంటికి వచ్చేవాడు. లేకుంటే ఏ జూద గృహంలోనో పడుకొనేవాడు. కాకుంటే ఏ అర్ధరాత్రో ఎవరో తీసుకొచ్చి ఇంటి దగ్గర విడిచే వారు భర్తని.

సరోజినికి జీవితం మీద రోత పుట్టింది. జీవితం గురించి ఎన్నెన్ని కలలు కంది. చిన్నతనంలో బొమ్మల పెళ్ళిళ్ళు, చెరువు గట్టున కూర్చోని పాటలు, ఆటలు, తను అన్నిటిలోనూ ఫస్టే. తనతో

పరుగెత్తే వారే ఉండేవారు కాదు. చిన్నతనమే మంచిది. ఏ కల్మషం లేని లేత హృదయాలు. మనసార నవ్వుకోవచ్చు. ఆ నవ్వు హృదయపు ఆనంద అంచుల్లోంచి వస్తుంది. ఇప్పుడో? అంతా నిర్లిప్తత. తెచ్చుకొని నవ్వాలి. అదీ పెదాల చివర ఆగిపోతుంది. అలా సరోజిని గత కాలపు తియ్యని స్మృతుల్ని మననం చేసుకుంటోంది. "అమ్మా!" అంటూ కూతురు లక్ష్మి వచ్చి ఒడిలో కూర్చుంది. తను ఇన్ని బాధల్లోనూ ఇంకా జీవించి ఉందంటే అది ఈ తీయని పిలుపు కోసమే. వాళ్ళకి ఆ పిలుపు కరువై అనాధలు కాకూడదు. అందుకే ఎలాగో జీవితాన్ని ఈడ్చుకొంటూ పిల్లలిద్దర్నీ ప్రయోజకుల్ని చెయ్యాలి. అదెలా! ఇంతవరకు తనెవర్నీ ఏ సహాయం కోరలేదు. జీవిత చక్రం ఇలా వక్ర మార్గానికి మళ్ళుతుందని తన కింత దుర్గతి పడుతుందని కలలోకూడా అనుకోలేదు. ఎలా ... ఎలా ... భర్త ... భర్తని తలుచుకొనేసరికి అవ్యక్తమైన బాధ. అసలు మనిషెందుకిలా మారతాడో? సున్నితమైన మనస్సుని వ్యసనాలనే విషం పోసి పాషాణంగా మార్చుకుంటాడు. ఎంతో ఉన్నత సంస్కారులనుకున్న వారు కూడా ఈ వ్యసనాలకి బానిసలై తమ జీవిత చుక్కాని అయిన భార్యను నడి సముద్రంలో విసిరేసి చుక్కానిలేకుండా మునిగిపోతారు. తనలాటి వా రెందరో ఇలా బాధ పడుతుంటారు. కానీ అందరూ వీటి నుంచి బయట పడుతున్నారా? పడితే ఏ విధంగా? ఏదో విధంగా జీవించాలి. తన పిల్లలిద్దరూ అనాధలు కాకూడదు. ఆ రాత్రంతా ఆలోచించి వో నిర్ణయాని కొచ్చింది.

పూలమ్మిన చోట కట్టెలమ్మడం మంచిది కాదు. ఇక్కడే ఉంటే అందరూ తనపట్ల సానుభూతి చూపి ఆ మాటల్తో మరీ కించపరుస్తారు. అందుకే పిల్లలిద్దర్నీ తీసుకుని పట్టణానికి బయలుదేరింది. భర్తకు విషయాన్ని చెప్పింది. అతని కిదేమీ బుర్ర కెక్కలేదు. "నీ బతుకేదో నువ్వు బతుకు. నా కేమీ చెప్పకు" అని కసిరాడు. "మీరూ రండి. ఏదో నాలు గిళ్ళల్లో పనిచేసుకొని పిల్లల్ని ప్రయోజకుల్నిచేద్దాం" అని బతిమాలింది. నేను రానుగాక రాను అని చెరచెరా వెళ్ళిపోయాడు. ఇక సరోజిని ధైర్యం తెచ్చుకొని పట్టణానికి బయలుదేరింది. వూర్లో ఎవరికీ చెప్ప లేదు. చెప్పినా వాళ్ళేంచేస్తారు. నీ ఖర్మ అంటారు. అందుకే తెల్లవారుజామునే బయలుదేరి బండెక్కింది. 'దిక్కులేనివారికి దేవుడే దిక్కు' ఎంత అధర్మం ప్రబలినా ఏ కోశాన్నో ధర్మం ఉంటుంది. ట్రైన్‌లో కలిసిన వో ముసలావిడ సరోజిన్ని పలకరించి విషయాలన్నీ విని—తనది ఆ పట్టణమే అని తన కొడుకో పెద్ద ఉద్యోగి అని నీ కో దారి చూపెడతాను రా అని ఆటోలో తనతోపాటు తీసుకెళ్ళింది. సరోజిని మనస్సంతా వూర్లో ఉన్న భర్త ఆలోచనల తోనే ఉంది. ఒడిలో పిల్లలిద్దరు.

ఆటో ఒక భవనం ముందు ఆగింది. "ఇదే మా ఇల్లు. దిగమ్మా" అంటూ ఆవిడ చెప్పడంతో దిగింది. ఆవిడ లోపలికి వెళ్ళిఅవిమమ్మల్ని వరండాలో కూర్చోమని. కోడలితో చెప్పి, వచ్చి పెరట్లోకి మమ్మల్ని తీసుకెళ్ళింది. చాలా విశాలమైన ప్రదేశం. ఎన్నెన్నో రకాల మొక్కలు. పెద్ద నుయ్యి.




ప్రహరీ గోడకు ఆన్చి మూలగా ఒక పాక ఉన్నాయి. ఆ పాకలో సరోజినిని ఉండమన్నారు.

ఆ రోజునుంచి వాళ్ళింట్లో పనులన్నీ తనే చేసేది. ఇంకా రెండు మూడిళ్ళల్లో నీరు మొయ్యడం, అంట్లు తోమడం చేస్తూ కాలం గడుపుతూంది. కొడుకుని,కూతుర్ని బడిలో వేసింది.రోజూవాళ్ళిద్దరూ బడికి వెళుతున్నారు. ఉన్నట్టుండి సరోజిని భర్త చంద్రయ్య వచ్చి పడ్డాడు. వెతుక్కుంటూ సరోజిని దగ్గర కొచ్చి బోరున ఏడ్చి నన్ను క్షమించు. నేనూ ఇక్కడే ఉంటాను అన్నాడు. సరోజినికి కొండంత ధైర్యం వచ్చింది. తన భర్త తనను పోషించక పోయినా తన దగ్గరే ఉంటే గౌరవంగా ఉండొచ్చు కదా, అందుకే సంతోషించింది.

కాలంతోపాటు సరోజిని పిల్లలిద్దరూ ఎదిగారు. సరోజిని పదిహేనేళ్ళుగా అంట్లు తోమి చేతులు అరగ్గొట్టుకుంటూంది. అలాగే పిల్లల్ని చదివించు కొస్తూంది. కూతురు ఎనిమిది వరకు చదివి మానేసి మిషన్ నేర్చుకుంటూంది. కొడుకు పదో తరగతి పాసయ్యాడు. పోలీస్ ట్రెయినింగ్ పూర్తి చేసుకుని నిన్ననే తిరిగొచ్చాడు. సరోజిని కొడుకుని చూసి ఆనందంతో ఉప్పొంగి పోయింది. తాను ఇన్నేళ్ళూ పడిన శ్రమను మరిచే పోయింది.

ట్రెయినింగు నించి తిరిగొస్తూ ట్రెయినింగు పూర్తయ్యాక ఇచ్చే డబ్బుతో తల్లికి ఖరీదైన ఈ చీర కొని తెచ్చాడు. చీర అమ్మ చేతిలో పెట్టి కాళ్ళకు దణ్ణం పెట్టాడు కొడుకు. ఆ తల్లి ఆనందబాష్పాలు రాల్చింది. చీర విప్పి చూసింది. ఆమె కళ్ళను ఆమే నమ్మలేక పోయింది. సరిగా అదే చీర. అమ్మగారు పండక్కి కొనుక్కున్న చీర. అంచు కుట్టించు రమ్మంటే ఇంటికి తెచ్చింది. అప్పుడు కొడుకు చీర బాగుందా అమ్మా అంటే చాలా బాగుందన్నది సరోజిని. అందుకే అలాటి చీరే ఎంత గుర్తుంచుకుని తెచ్చాడో!

"బాబూ! నా కెందుకురా ఈ చీర. ఇది నాలాటోళ్ళు కట్టుకోడానికి తగదురా. ఇంత ఖరీదు చీర నా కొద్దు. ఆ డబ్బుతో నువ్వు, చెల్లీ బట్టలు కొనుక్కోండి. నా కొద్దుగా కొద్దు" అంది సరోజిని. కొడుకు "అమ్మా! నీ శరీరంలో ప్రతి రక్తపు బిందువు మా కోసం వెచ్చించి నీ కోరిక లన్నిటిని మా కోసం అణచుకుని మనసులోనే వాటిని దగ్ధం చేసుకున్నావు. మనుషు లంతా ఒకటే. అందరికీ కోరిక లుంటాయి. కాని అవి తీరేది కొందరికే, అలా అని న్యాయంగా వాటిని తీర్చుకునే అవకాశం వచ్చినప్పుడు తీర్చుకోవడంలో తప్పు లేదు. అందుకే నువ్వు ఈ చీర కట్టుకోవడానికి అన్ని విధాలా తగి ఉన్నావు. ఇలాటి ఖరీదైన చీరలతో సింగారించుకునే వారిలో నిజంగా అర్హతున్న వాళ్ళెందరు? నీ లాటి వాళ్ళే అందుకు అర్హులు. మిమ్మల్ని చూసి మీ త్యాగాన్ని అర్థం చేసుకోలేని వాళ్ళు ఈర్ష్య పడతారు. మీ రెప్పుడూ వాళ్ళకంటే దిగువనే ఉండాలనివాళ్ళతో నడుస్తుంటేమీరుపనిమనుషులు, నౌకర్లని ప్రత్యేకంగా తెలియాలని వస్త్ర ధారణ దగ్గర నుంచి మిమ్మల్ని ఎదగ నివ్వకుండా అణచి వేస్తున్నారు. రేపు శనివారం. ఉదయాన్నే తలంటుకుని ఈ చీర కట్టుకుని నన్ను లేపాలి. నేను చచ్చినట్టే అన్నాడు" కొడుకు.

'బాబూ! అంత మాటనకురా! కట్టుకుంటా' అంటూ ఆ తల్లి ఉదయాన్నే చీర కట్టుకుంది. అమ్మాయిగారూ. ఆ తరవాత జరిగింది మీకు తెలుసు. దీనిలో చేయకూడని పనేదైనా చేసుంటే మన్నించండి" అంది నెత్తి మీద నీళ్ళు పోస్తూ సరోజిని.

ఒక్కసారి సుమతి మతి పోయింది. తానెంత కుత్సితురాలో ఎదుటి వారు తన కంటే హీనంగా కనపడాలనీ, వారెప్పుడూ ఎదగ కూడదనే భావం తనకు కలగడం తన అజ్ఞానానికి నిదర్శనమని తన చదువంతా వ్యర్థమనీ తల మీద నీళ్ళు పోస్తూ తన అజ్ఞానాన్ని కడిగేసిన సరోజినికి లేచి దణ్ణం పెట్టింది సుమతి. ★